



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 649 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర మంగళవారం 27 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

# అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకలు అద్భుతం

### - రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధి





అమరావతి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, జనవరి 26 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కలల రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. అద్భుతంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భవిష్యత్ లక్ష్యాలకు అద్దంపట్టింది. నేలపాడు ప్రాంతంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి నగరం సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. గణతంత్ర దినోత్సవ వేదిక నుంచి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తూ.. రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా... రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుందని మాటిస్తున్నాము అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తెలిపారు

# బడ్జెట్ సమావేశాల్లో జిల్లా వాణిని బలంగా వినిపిస్తా

### - కాకినాడ పార్లమెంట్ సభ్యుడు ఉదయ్ శ్రీనివాస్



కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : రేపటి నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కాకినాడ జిల్లా వాణిని బలంగా వినిపిస్తానని కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గతంలో కాకినాడ జిల్లాకు కేటాయించిన ప్రాజెక్టులు పురోగతితో పాటు కొత్త ప్రాజెక్టుల కోసం గళం వినిపిస్తానన్నారు. పార్లమెంటులో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారని, పార్లమెంటు ఉభయ సభల్లో కూటమి ఎంపీలతో కలిసి రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని పవన్ కళ్యాణ్ సూచించారని తెలిపారు. సాధారణ బడ్జెట్ తో పాటు ప్రవేశపెట్టనున్న రైల్వే బడ్జెట్లో కాకినాడ జిల్లాకు తగిన ప్రాధాన్యం దక్కెందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.



# జాతీయ జెండాకు అవమానం

### - రంధ్రాలు పడి చిరిగిన జెండా ఎగరవేత.. కొత్తపేటలో ఘటన

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జాతీయ జెండా ఎగురవేసే క్రమంలో పాటించాల్సిన నిబంధనలను పక్కనపెట్టి వచ్చామా..? పోయామా..? అన్న విధంగా తమ పని కానిచ్చారు. రంధ్రాలు పడి చిరిగిన జెండాను ఎగరవేసిన అధికారులు తమ పని అయిపోయిందని అక్కడి నుండి వెళ్లిపోయిన ఘటన కేశంపేట మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కొత్తపేట ప్రాథమిక పశు వైద్య కేంద్రం ఆవరణలో రంధ్రాలు పడిన జాతీయ జెండాను పశు వైద్యాధికారి ఎగురవేసి వెళ్ళిపోయారు. ఇది కాస్త మీడియా కంట్లో పడటంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

# డేటా ఆధారిత . పాలనే లక్ష్యం..

## ఆర్టీజీఎస్‌పై సీఎం సమీక్ష

.పాలనలో టెక్నాలజీ వినియోగం పెంచాలి: సీఎం చంద్రబాబు

2026ను 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్'గా మార్చాలని పిలుపు

ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని సీఎం ఆదేశం

'మన మిత్ర' ద్వారా ఇప్పటివరకు 1.43 కోట్ల మందికి సేవలు



పాలనలో సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించి, క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. డేటా ఆధారిత పాలనపై మరింత దృష్టి సారిస్తామని, 2026వ సంవత్సరాన్ని 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్'గా మార్చాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... సామర్థ్యం లేని ఉద్యోగులకు సరైన శిక్షణ ఇచ్చి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ఎదురయ్యే అనేక సమస్యలను టెక్నాలజీతో సులభంగా పరిష్కరించవచ్చని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను (గ్రీవెన్సులు) ఏఐ ద్వారా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. 'మన మిత్ర' - వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై కూడా సీఎం సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు

# కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉంది

### : కోదండరాం సంచలన వ్యాఖ్యలు



2

# అమరావతిలో వేడుకలు అభినందనీయం

### రాజ్యాంగస్ఫూర్తితో ఏపిలో అభివృద్ధి

### డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి,జనవరి26

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు అద్భుతంగా జరిగాయి. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధి జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. ఈ కార్యక్రమం భవిష్యత్తు లక్ష్యాలకు అద్దంపట్టింది. నేలపాడు ప్రాంతంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించాయి' అని పేర్కొన్నారు. పవన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'సీఎం చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నగరం సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. గణతంత్ర దినోత్సవ వేదిక నుంచి గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశర చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తున్నా. రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుందని మాటిస్తున్నాము' అని పవన్ అన్నారు.



# 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నాం

### భద్రతా దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్

### అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్న అబ్దుల్ నజీర్

చరిత్రలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గణతంత్ర దిన వేడుకలను నిర్వహించారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరేడ్ మైదానంలో జరిగిన ఈ వేడుకలు ప్రభుత్వ ప్రతిష్ఠను చాటేలా సాగాయి. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అధికారిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఇండియన్ ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, కర్నూల్ ఏపీఎస్పీ రెండో బెటాలియన్ సహా వివిధ భద్రతా దళాలు గవర్నర్‌కు గౌరవ వందనం అందించాయి


2

# నాటి స్వాతంత్ర్య వీరుల బాటలో పయనించి దేశసేవలో పునరంకితమవుదాం

**- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మన దేశ విధానం - భిన్నత్వంలో ఏకత్వమే మన ఘనత**

**- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**





కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం, పెద్ద రాజ్యాంగం, చెక్కుచెదరని రాజ్యాంగం కలిగిన దేశం భారతదేశమని, దేశానికి దశా, దిశా నిర్దేశం చేసిన గొప్ప రాజ్యాంగాన్ని అమలుపరచుకున్న రోజు జనవరి 26 అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం వాడపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశభక్తిని పెంపొందించే విధంగా నాటి స్వాతంత్ర సమరయోధులు, మహనీయుల యొక్క వేషధారణలో బాలలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలను తలచుకుని వారి అడుగుజాడల్లో రాజ్యాంగ స్ఫూర్తితో పయనించడమే ఆ మహానుభావులకు మనమిచ్చే నివాళి అన్నారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను పుణికి పుచ్చుకుని ముందుకు వెళ్లాలన్నారు. గాంధీజీ, నెహ్రూజీ, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఝాన్సీ లక్ష్మీబాయి, అల్లూరి సీతారామరాజు వంటి స్వాతంత్ర సమరయోధులందరినీ స్మరించుకుని వారి బాటలో పయనించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మన దేశం యొక్క గొప్పతనం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ఘనతన్నారు. వివిధ మతాలు, జాతులు, కులాలు, భాషలు ఉన్నా మనందరం ఒక్కటే అని, మనమంతా భారతమాత ముద్దుబిడ్డలమని, మనది భారత జాతి.. ఆ తరువాతే మరేదైనా.. ఏమైనా అనేది గుర్తించుకోవాలన్నారు. అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చెంది, దేశ ఐక్యతకు కృషి చేయాలన్నారు. నేటి విద్యార్థులంతా భావి భారత పౌరులుగా ఈ భావనలన్నీ ప్రోది చేసుకొని దేశ సేవకు పునరంకితం కావాలన్నారు

## 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో

# ప్రణాళికలు అమలు చేస్తున్నాం

.వేడుకల అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. సామాజిక పెన్షన్లకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి 63 లక్షల మందికిపైగా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చుతున్నట్లు వెల్లడించారు. 'దీపం' పథకం ద్వారా పేద మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని గవర్నర్ చెప్పారు. నీటి భద్రతను ప్రధాన విధానంగా తీసుకుని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం 'పొలం పిలుస్తోంది', 'రైతన్న మీ కోసం' వంటి కార్యక్రమాల ద్వారా నేరుగా మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు. రవాణా రంగంలో రోడ్డు, రైల్వే, జల రవాణాకు సమాన ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పూడ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు విశాఖను ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీల అమలుతో వినియోగదారులపై భారం తగ్గించామని వివరించారు. ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం, ప్లగ్ అండ్ ప్లే విధానం, టూరిజం పాలసీ 202429 అమలు, స్వచ్ఛ ఆంధ్ర సేఫ్ ఆంధ్ర కార్యక్రమాలు, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, ఏఐ టెక్నాలజీపై దృష్టి వంటి అంశాలను గవర్నర్ ప్రస్తావించారు. 2047 'స్వర్ణ ఆంధ్ర' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు. మొత్తంగా అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్రానికి కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టుగా, అభివృద్ధి, సంక్షేమాలపై ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబించేలా నిలిచాయి

# కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉంది:

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి తమ నిర్ణయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. తాము మాత్రం పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ కానివ్వబోమని ఉద్ఘాటించారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు లేని భయం, విచారణ సమయంలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగంతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లు అధికారమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన అంతం కావాలని, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ఒక ప్రయత్నం జరగాలని, ప్రభుత్వంలో తమకు భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నామని ఆయన అన్నారు. ఈ కారణాల వల్లే తామంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికామని కోదండరాం తెలిపారు.

# పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

రేపల్లె

77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రేపల్లె లో. పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి మొద్దు సురేష్ జాతీయ జెండా ఆవిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ కిషోర్ బాబు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, నాగలీల పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు సీనియర్ నాయకులు బేతపూడి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావు, బోయిన ఉయ్యూరు సుగ్గల సుందరయ్య, కిషోర్, సైకం రాజు, పరిశుద్ధరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.





# విద్యార్థిని కీర్తనకు సైకిల్ అందజేత

తాళ్ళరేవు , సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : తాళ్ళరేవు మండలం పి.మల్లవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో 8వ తరగతి చదువుతున్న పిల్లి కీర్తన ప్రతిరోజు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో పేరు లేని చెట్టు గ్రామం నుంచి కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని తెలుసుకున్న తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) మానవతా దృక్పథంతో స్పందించారు. రాష్ట్ర విద్యా మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా తన సొంత నిధులతో సైకిల్ని కొనుగోలు చేసి ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు, పార్వతీ దంపతుల చేతుల మీదుగా విద్యార్థిని కీర్తనకు బహుకరించారు. పేద కుటుంబానికి చెందిన కీర్తన చదువుకు చేయూతగా ఈ సైకిల్ అందజేయడంపై తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, మాజీ మార్కెటింగ్ చైర్మన్ మందాల గంగ సూర్యనారాయణ, దాసరి వేణుగోపాల్, సబ్బవరపు కృష్ణ, జయదేవ్, విద్యార్థిని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉత్తమ ఏపియమ్ గా మునగాల లక్ష్మి నారాయణ



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 26 : గణతంత్ర దినోత్సవ సందర్భంగా మార్కాపురం ఎస్.వి.కె.పి.కళాశాల ఆవరణలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో సి.యస్.పురం వెలుగు డిఆర్డిఏ మునగాల లక్ష్మీనారాయణకు ఉత్తమ ఏపియమ్ గా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండల ప్రజల ఆధారాభిమానాలతోనే ఈ అవార్డు దక్కిందన్నారు.

# కృపావరంకు ఉత్తమ సూపర్వైజర్ అవార్డు



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 26 : గణతంత్ర దినోత్సవ సందర్భంగా మార్కాపురం ఎస్.వి.కె.పి కళాశాల ఆవరణలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో వెలిగండ్ల అంగనవాడి సూపర్వైజర్ కృపావరంకు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా ఉత్తమ సూపర్వైజర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆధారాభిమానాలతోనే ఈ అవార్డు దక్కిందన్నారు.

# జెండా ఎగురవేసిన టిడిపి మండల అధ్యక్షుడు బొబ్బురి రమేష్




మార్కాపురం జిల్లా, ప్రతినిధి సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 26 : సి.యస్.పురం మండల కేంద్రంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా టిడిపి పార్టీ ఆఫీస్ వద్ద జాతీయ జెండాను మండల అధ్యక్షుడు బొబ్బురి రమేష్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సి.యస్.పురం పట్టణ అధ్యక్షుడు బత్తుల వెంకటాద్రి, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, లక్ష్మీదేవి, యన్.సి.మాలకొండయ్య, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.?

## భారతదేశ రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించిన సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తనీరు సింగరకొండ




బాపట్ల జిల్లా

బాపట్ల పట్టణంలోని పెద్ద అంబేద్కర్ బొమ్మ వద్ద భారతదేశ రాజ్యాంగ పీఠికను సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల చే సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాపట్ల జిల్లా సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు సిపిఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, దళిత హక్కుల పోరాట సమితి డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు దాసి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మామిడి బత్తుల వెంకటేశ్వరరావు అంజయ్య కీర్తి వెంకటేశ్వర్లు నరేంద్ర సాంసన్ కొండల్ రెడ్డి సాంబశివరావు నాగరాజు కొండలు వెంకటేశ్వరరావు జాన్సన్ ఫణి ఎలమంద మురళి, రాముడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ జిల్లా అధికారిగా తూతిక శ్రీనివాస విశ్వనాథ్

రంపచోడవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం అమలులో జిల్లాలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను పోలవరం జిల్లా ఉత్తమ జిల్లా అధికారిగా తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఎంపికయ్యారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అట్టహాసంగా జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, ఇతర అధికారులు చేతులు మీదుగా శ్రీనివాస విశ్వనాథ్ ఉత్తమ జిల్లా అధికారిగా అవార్డు అందుకున్నారు. రంపచోడవరం డివిజన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టరుగా భాద్యతలు తీసుకున్న నాటినుండి ఉపాధిహామీ పథకం శ్రామికులకు మేలు జరిగేవిధంగా వారి సంక్షేమానికి శ్రీనివాస విశ్వనాథ్ కృషి చేసారు. భారత రక్షణ రంగం (నేవీ)లో 15 సంవత్సరాలు పనిచేసిన తర్వాత శ్రీనివాస విశ్వనాథ్ గ్రూప్ - 1లో ఎంపికై అనతికాలంలో మంచి అధికారిగా పేరు సంపాదించడమే కాక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు, పేదలకు అందజేయడంలో ముందుంటూ పలువురు ప్రశంసలు అందుకున్నారు. ఉద్యోగ విధులతో పాటుగా సామజిక సేవలో చురుకుగా పాల్గొనే శ్రీనివాస విశ్వనాథ్ పేదల మనిషిగా పేరు పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యంగ, వితంతు, వృద్దాప్య, చేనేత, గీత సామజిక భద్రతా పింఛను పథకానికి 'ఎన్టీఆర్ భరోసా' అనే




పేరును వీడియో కాన్ఫరెన్సులో సూచించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు అందుకుని రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. సమాజానికి, పేదలకు ఎన్నో సేవలు అందిస్తున్న ఎపిడి శ్రీనివాస విశ్వనాథ్ కు గతంలో అమెరికాలోని దాన సంస్థ 2014లో 'వారియర్ అఫ్ పూర్' పురష్కారం ఇచ్చి సత్కరించింది. అలాగే 2015లో సోషల్ సర్వీస్ విభాగంలో శ్రీనివాస విశ్వనాథ్ విశ్వకళా మండలి నుండి 'ట్రూ ఇండియన్' అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా శ్రీసత్యసాయి సేవ పురష్కారం, సర్ ఆర్థర్ కాటన్ జాతీయ పురష్కారం, గత గోదావరి మహాపుష్కరాలలో ఉత్తమ అధికారిగా ప్రభుత్వం నుండి, దళిత, గిరిజన, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ సామజిక న్యాయం కోసం పనిచేస్తున్నారని 2016లో హైదరాబాద్, సుందరయ్య కేంద్రంలో అంబేద్కర్ జాతీయ పురష్కారం ఇలా పలు సంస్థల నుంచి, ప్రజా సంఘాల నుంచి అనేక పురష్కారాలు అందుకున్నారు. శ్రీనివాస విశ్వనాథ్ సేవలను గుర్తించి అమెరికాలోని అంద్రూస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించారు. ప్రస్తుతం పోలవరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హోదాలో శ్రామికులకు సకాలంలో పని కల్పిస్తూ, శ్రామికులు చేసిన పనికి జిల్లాలో అత్యధిక వేతనాలు కల్పిస్తూ జీ-రామ్-జీ పథకాన్ని క్షేత్రస్థాయిలో ఆదివాసీలకు ఉపయోగపడేవిధంగా కృషి చేస్తున్నందుకు గాను శ్రీనివాస విశ్వనాథ్ ఉత్తమ జిల్లా అధికారిగా ఎంపిక అయ్యారు. సందర్భంగా ఎపిడి శ్రీనివాస విశ్వనాథ్ ను పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రశంసించారు.



## వరుసగా రెండవ సారి ప్రభుత్వం నుండి ప్రశంసా పత్రం అందుకున్న కందుల పరమేశ్వర రావు

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : పరమేశ్వరా చారిటబుల్ ట్రస్ట్ (పిసిటి) ద్వారా చేసిన చేస్తున్న సేవా కార్యక్రమాలు గర్భిణీ స్త్రీలకు పోషకాహారం, అంగనవాడి పిల్లలకు కుర్చీలు, బాస్కెట్స్, బుక్స్ మరియు పోషకాహారం, వృద్ధులకు అనేక సేవా కార్యక్రమాలు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, దుప్పట్లు & చీరలు పంపిణీ కార్యక్రమాలు, విద్యార్థులకు బుక్స్ పంపిణీ కార్యక్రమాలు, వంటి ఆనేక సేవా కార్యక్రమాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుండి "ప్రశంశాత్మక పత్రము"ను విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శ్రీ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదగా వరుసగా రెండోసారి పరమేశ్వరా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుల పరమేశ్వర రావు తీసుకోవడం జరిగింది. సర్వప్రాణి సేవయే మాధవ సేవ అన్న అర్యోక్తిని నిజం చేస్తూ, పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు అన్న, వస్త్ర దానాలు, గోమాతకు మంచినీటి తొట్లు ఏర్పాటు చేసి, జల చరాల వంటి మూగ జీవులకు సైతం ఆహారాన్ని అందిస్తూ, కరోనా వంటి సమయంలో రోజుల తరబడి పేదలకు అన్నదానం చేసిన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం వారు గతంలో కూడా గణతంత్ర దినోత్సవం సందర్భంగా కందుల పరమేశ్వర రావుకి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన కందుల పరమేశ్వర రావుకి ఇచ్చారు. ఇలాంటి గుర్తింపులు భవిష్యత్ లో మరెన్నో లభించాలని, అతని సేవాకార్యక్రమాలు మరింతగా విస్తరించాలని ఆకాంక్షిస్తూ మంగళగిరి డిప్యూటి ట్రైనింగ్ ఆఫీసర్ జెయం ఐ.టి.ఐ దేగల రామారావు ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరై కందుల పరమేశ్వరరావు గారిని అభినందించినారు. ఈ సందర్భంగా కందుల పరమేశ్వర రావు మాట్లాడుతూ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని, నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలను గవర్నమెంట్ గుర్తించి అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందకరమైన విషయం అని అన్నారు.

## సత్యదేవుని నిత్యాన్నదాన పధకానికి రూ.1,00,000/- విరాళం



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన శివ వెంకటేశ్వరరావు దంపతులు రూ.1,00,000/- విరాళమును దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావుకు అందజేసి, ప్రతీ సంవత్సరం దానిపై వచ్చు వడ్డీతో ఆగష్టు 21వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా దాతలను ఈవో త్రినాథరావు అభినందించారు.

## తిరుమూరు పంచాయతీ సచివాలయం ఎదుట ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



వాకాడు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : తిరుపతి జిల్లా వాకాడు మండలం తిరుమూరు గ్రామ పంచాయతీ సచివాలయం ఎదుట 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కుంచం దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎస్.లక్ష్మిలు కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను, రాజ్యాంగం ద్వారా ప్రజలకు లభించిన హక్కులు, బాధ్యతల గురించి విద్యార్థులకు వివరించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని కుంచం దయాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ సంధ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రశాంత్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, వీఆర్ఏ కామేశ్వరమ్మతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు మరియు హాజరైన వారికి స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.



## అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అక్షయ్ ఫౌండేషన్ చేయూత

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో అగ్ని ప్రమాదశాత్తు ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి నవఖండ్రవాడ మన ఊరు మనందరి బాధ్యత (అక్షయ్ ఫౌండేషన్) టీమ్ 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు సాయం అందించారు. చిత్రాడ గ్రామంలో అగ్ని ప్రమాదశాత్తు ఇళ్లుతో సహా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్నీ ఖండవల్లి సత్యవతి, కృష్ణ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనో ధైర్యం చెప్పి వారికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్న తోడుగా ఉంటామని అధ్యక్షుడు ముదర సోమరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బళ్ల రజనీ వాణీ సురేష్, సిద్ధాంతపు బాలకృష్ణ, మాకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లిత్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవం.

గుంటూరు జిల్లా తెనాలి

రథసప్తమని పురస్కరించుకొని గౌరావజ్జుల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వరపేట నుండి బోస్ రోడ్ లోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు చిన్నారులు నగర సంకీర్తనలు చేస్తూ వీధి సంకీర్తన చేశారు. అనంతరం సుల్తానాబాద్ లోని అలపాటి నగర్ లో కుమార్ పంప్స్ వారి సౌజన్యంతో కొలువైన శ్రీ షిరిడి సాయిబాబా దత్తాత్రేయ స్వామి ఆలయంలో చిన్నారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గౌరావజ్జుల ఆంజనేయ శాస్త్రి సారధ్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన లో భాగంగా పంచరత్న కీర్తనలు, ఉపచార సంప్రదాయ కీర్తనలు చిన్నారులు ఆలపించారు. అనంతరం మంగళహారతి తీర్థప్రసాద వితరణ చేశారు. సంకీర్తనాలాపనకు శ్రీకృష్ణ అభిరామ్ వయొలిన్, మృదంగం సురేష్ బాబు, డోలు ప్రసాద్ లు వాద్య సహకారం అందించారు. కుమార్ పంప్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, వెంపటి సత్యనారాయణ , ములుకుట్ల రఘునాథ్ , అందె బాలచంద్రమౌళి ముఖ్య అతిథిలు గా విచ్చేయగా శ్యామ్, కుమార్ ,సుచరిత , అందె తన్మయి , జెనీత,ఇందిరా , దివ్యశ్రీ, కార్తీక్, కుమార్, సౌజన్య, రాజ రాజేశ్వరి,శ్రీలత, ప్రియాంక, శ్రీ శాంతి, సత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## ఆలమూరు జనార్ధన స్వామి వారి ఆలయానికి రానున్న కాణిపాకం ధర్మ ప్రచార రథం



ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ ధర్మ ప్రచారరథం సోమవారం మధ్యాహ్నం 1గంటకు ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి ఆలయానికి తరలి రానుంది. శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు జరుగుతున్న రథసప్తమి వేడుకల్లో 23, 24, 25 తేదీలలో అక్కడ హిందూ ధర్మ ప్రచార శోభాయాత్ర ముగించుకుని తిరిగి రాజమండ్రి రావులపాలెం మీదుగా కాణిపాకం వెళుతున్న వినాయక స్వామి వారి ధర్మప్రచార రథం నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరుకు వస్తూ ఉండడంతో భక్తులంతా మధ్యాహ్నం 1గంట కల్లా ఆలయం వద్దకు తరలివచ్చి, వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు పిలుపునిచ్చారు. ధర్మ ప్రచార రథం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆలయం వద్ద వేంచేసి భక్తులకు స్వామివారి దర్శనం ఇవ్వనున్నారని ఆయన తెలిపారు

## రేపల్లె ఆర్టీసీ డిపో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులు

రేపల్లె

రక్తం అందించి ప్రాణదాతలు కావాలని రేపల్లె రెడ్ క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రేపల్లె ఆర్టీసీ డిపో రేపల్లె బ్లడ్ బ్యాంకు రెడ్ క్రాస్ సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలోని గ్యారేజీ మెకానికల్ కార్మికులు పలువురు కండక్టర్లు డ్రైవర్లు సిబ్బంది స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం దానం చేశారు ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఏవి రమణ రెడ్ క్రాస్ రేపల్లె బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య రెడ్ క్రాస్ ప్రతినిధి సయ్యద్ కరీముల్లా ఆర్టీసీ ఎంఎఫ్ నందీశ్వరరావు ఎంప్లాయిస్ మజ్దూర్ యూనియన్ నాయకులు గ్యారేజీ మెకానికల్ కార్మికులు సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు




## సత్యదేవుని నిత్యాన్నదాన పధకానికి రూ.1,00,116/- విరాళం



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికు చెందిన మోదుకూరి లక్ష్మీనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.1,00,116/-విరాళమును దేవస్థానం ఆలయ పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్ కి అందజేసి, ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో జూన్ 3వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా దాతలను ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాంజీ పాల్గొన్నారు.

# లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది

## -: పద్మశ్రీపై మురళీ మోహన్

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 26 : గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో తనకు పద్మశ్రీ పురస్కారం దక్కడంపై సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ హర్షం వ్యక్తం చేశారు. అందరికీ నమస్కారం. నాకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూసిన పద్మ అవార్డు ఆదివారం సాయంత్రం ప్రకటించినప్పటి నుంచి అనేక మంది మిత్రులు, శ్రేయోభిలాషులు ఫోన్ చేశారు. వాళ్లందరితో నా సంతోషాన్ని పంచుకునే అవకాశం లభించింది. 'మీకు ఎప్పుడో రావాల్సింది.. ఇప్పుడైనా వచ్చింది' అని అంటుంటే.. లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది అని చెప్పాను. అన్నీ మనం అనుకున్నప్పుడే రావు. ఏదైనా ఎదురు చూపుల తర్వాత దొరికితే దాని విలువ ఎక్కువ. మిత్రులందరికీ నా శుభాకాంక్షలు. ఇంత మంచి అవార్డును ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులందరికీ కృతజ్ఞతలు. అవార్డు అందుకున్న తర్వాత వివరంగా ప్రెస్‌మీట్ పెట్టి చెబుతాను. థ్యాంక్యూ అంటూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. మాగంటి మురళీ మోహన్ ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో తనదైన ముద్ర వేశారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఎన్నో సందేశాత్మక చిత్రాలను అందించారు. 'జగమే మాయ' చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేసిన మురళీ మోహన్, క్రమశిక్షణ గల నటుడిగా పేరు తెచ్చుకుని 350కి పైగా సినిమాల్లో నటించారు. ఆయన ప్రస్థానం ఎందరికో ఆదర్శం. మురళీ మోహన్ కేవలం హీరోగానే కాకుండా సహాయ నటుడిగా, విలన్‌గా కూడా రాణించి తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. ఎనభైవ దశకంలో ఎంతో బిజీగా ఉంటూనే నాణ్యమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించడంలో ముందుండేవారు. ఆయన నటించిన చిత్రాల్లో కుటుంబ విలువలకు పెద్దపీట వేయడం వల్ల మహిళా ప్రేక్షకులు ఆయనను బాగా ఆదరించారు. కేవలం వెండితెరకే పరిమితం కాకుండా బుల్లితెరపై కూడా కీలక పాత్రలు పోషించి ఇంటింటికీ చేరువయ్యారు. తెలుగు చిత్రసీమలో అజాతశత్రువుగా పేరు పొందిన అతికొద్ది మందిలో ఆయన ఒకరు. నిర్మాతగా ఆయన స్థాపించిన జయభేరి ఆర్ట్స్ బ్యానర్ టాలీవుడ్‌లో ఎన్నో క్లాసిక్ సినిమాలకు వేదికైంది. ఈ సంస్థ ద్వారా ఆయన నిర్మించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందాయి. నిర్మాతగా ఆయన ఎప్పుడూ నైతిక విలువలకు కట్టుబడి పనిచేసేవారు. అసిస్టెంట్ డైరెక్టర్ల నుంచి టెక్నీషియన్ల వరకు ప్రతి ఒక్కరినీ గౌరవించే స్వభావం ఆయనను గొప్ప వ్యక్తిగా నిలబెట్టింది. జయభేరి గ్రూప్ ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత కూడా ఆయన సేవా దృక్పథం కొనసాగింది. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఎంపీగా గెలిచిన మురళీ మోహన్, తన నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సామాజిక సేవలు ఎందరికో మేలు చేకూర్చాయి. మాగంటి మురళీ మోహన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం ఆయన మానవతా దృక్పథానికి నిదర్శనం. రాజకీయాల్లో ఉన్నా సినిమా రంగాన్ని ఆయన ఎన్నడూ మర్చిపోలేదు. సుదీర్ఘ కాలంగా పద్మ పురస్కారాల కోసం ఆయన పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ, 2026లో ఈ గౌరవం దక్కడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గతంలో కొన్ని సందర్భాల్లో తన సేవలకు సరైన గుర్తింపు లభించడం లేదని సన్నిహితుల వద్ద తన అభిప్రాయాన్ని పంచుకున్న



సందర్భాలు ఉన్నాయి. ఏదేమైనా, ఆలస్యంగానైనా తగిన పురస్కారం లభించిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పద్మశ్రీ పురస్కారం ఆయన వ్యక్తిత్వానికి, కళా సేవకు దక్కిన నిజమైన గౌరవం. మురళీ మోహన్ ఫిట్‌నెస్ విషయంలో నేటి తరానికి పెద్ద మాదిరిగా నిలుస్తారు. ఎనభై ఏళ్ల వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పబ్లిక్ ఈవెంట్లలో పాల్గొంటూ పదిమందికి స్ఫూర్తినిస్తున్నారు. ఆయనకు పద్మశ్రీ రావడంపై మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోంది. తెలుగు సినిమా గౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిన మురళీ మోహన్ ప్రయాణం రాబోయే తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈ అరుదైన గౌరవం పొందిన సందర్భంగా ఆయనకు యావత్ తెలుగు జాతి శు భాకాంక్షలు తెలుపుతోంది



# ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నా:

**హీరోయిన్ ఈషా రెబ్బా**

**-తరుణ్ భాస్కర్ తో ఇషా రిలేషన్ లో ఉందంటూ వార్తలు**

**-ఆ వార్తల్లో నిజం లేదన్న ఈషా రెబ్బా**

**-ఒక వ్యక్తితో డేటింగ్ ప్రారంభ దశలో ఉందని వెల్లడి**

టాలీవుడ్ హీరోయిన్ ఈషా రెబ్బా, దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ మధ్య ప్రేమ, పెళ్లి రూమర్స్ గత కొన్ని నెలలుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో, మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గత దీపావళి పండుగా సందర్భంగా వీరు ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్న ఫొటోలు వైరల్ కావడంతో ఈ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో, ఈషా తనపై వస్తున్న వార్తలపై స్పందించింది. ఈషా హీరోయిన్‌గా, తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 30న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్స్ సందర్భంగా ఈషా మాట్లాడుతూ, ఈ రూమర్స్ పై స్పందించింది. "జరుగుతున్న ప్రచారం నిజం కాదు" అని ఆమె స్పష్టం చేసింది. తన తండ్రి కూడా ఈ వార్తలు చూసి "పెళ్లెప్పుడు?" అని అడిగారని చెప్పింది. అయితే, తాను ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నానని తెలిపింది. కానీ, అది ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పింది. అయితే, ఆ వ్యక్తి తరుణ్ భాస్కరా? కాదా? అన్నది మాత్రం స్పష్టం చేయలేదు







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com